క్లుప్తంగా

వైభవంగా కార్తిక దీపోత్సవం



గుమ్మిలేరులో కార్తిక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో శుక్రవారం రాత్రి కార్తిక దీపోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలో వేంచేసిన గ్రామ దేవతలు ఉరదాలమ్మ, దండు గంగాలమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద గ్రామానికి చెందిన మహిళలు భారీగా చేరుకుని ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన కార్తిక దీపాలను వెలగించారు. దీంతో ఆ ప్రాంతమంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. విద్యుతీలంకరణతో ఆలయం భక్తులను అలరించింది. ఆలయ ఆవరణలో రూపొందించిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామస్తులు గ్రామదేవతలను దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

చట్టాలపై అవగాహన

రాజోలు: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరమని రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.శాంతకుమారి అన్నారు. శుక్రవారం రాజోలు పోలీస్ ఆధ్వర్యంలో మహిళా సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ నిరోధక చట్టం, మహిళా చట్టాలపై హెడ్ కానిస్టేబుల్ గిరి, రైటర్ అప్పలరాజు వివరించారు. విద్యార్థులు తరగతులకు వెళ్లకుండా చెడు వ్యసనాలకు గురికావద్దని హితవు పలికారు. చదువుపై శ్రద్ధ చూపించి మంచి మార్కులు సాధించాలన్నారు. అధ్యాపకులు పి.నరసింహరాజు, యం. అంబేద్కర్, బీఎస్ఎస్ నరసింహరావు, ఎస్.శాంతిశ్రీ, ఎన్ఎస్ఎస్ పీఓ రాజబాబు, మహిళా పోలీసులు కె.వి.ఎస్.గనికమ్మ, ఎన్.జ్యోతి, సీహెచ్ వరలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వినతి



మామిడికుదురు జెడ్పీటీసీకి వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగి అనంతలక్ష్మి

మామిడికుదురు: తమ సమస్యలు పరిష్కరించి, తమకు న్యాయం చేయాలని కోరుతూ 104 ఉద్యోగులు శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు కొరెడ్డి అంజిబాబుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. లూటుకుర్రులో జెడ్పీటీసీ సభ్యుడిని కలసి ఈ వినతిపత్రం అందజేశారు. 104 వ్యవస్థను పీహెచ్‌సీల ద్వారా నేరుగా ప్రభుత్వమే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, జీఓ నెంబర్–7ను వర్తింప చేయాలని వినతిపత్రంలో కోరారు. వినితపత్రం ఇచ్చిన వారిలో 104 యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగజ్జీవన్ రావు, డీఈఓ అనంతలక్ష్మి ఉన్నారు.

ప్రభుత్వ అనుమతులు అతిక్రమిస్తే చర్యలు

అయినవిల్లి: ఇసుక తవ్వకాల్లో ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు తప్పనిసరిగా పాటించాలని అలా పాటించపోతే చర్యలు తప్పవని ఈఓపీఆర్డీ వాణీశ్రీ బెహరా అన్నారు. శుక్రవారం కొండుకుదురు గ్రామంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంపును ఆమె పరిశీలించారు. ఇసుక ర్యాంపుల్లో ప్రభుత్వ అనుమతులు విధిగా పాటించాలన్నారు. అనధికార ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు నిషిద్ధమన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో ఉన్నారు.

పారిశుధ్య చర్యలు పాటించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

అంతర్వేది తీర్థ పనులకు టెండర్ల ఖరారు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించే లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలకు గాను వివిధ పనులకై 13 ఐటమ్స్‌కు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించినట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో వీటిని నిర్వహించామన్నారు. వీటిలో తలనీలాలు పోగు చేసుకునే హక్కు, తాటి ఆకుల సరఫరా, క్యూలైన్లు లేబర్ కాంట్రాక్ట్, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రింటింగ్ మెటీరియల్స్ సరఫరా చేయుట, శానిటేషన్ లేబర్ కాంట్రాక్టు, సంవత్సర కాలానికి కొబ్బరి చెక్కలు పోగు చేసుకునే హక్కునకు సంబంధించి టెండర్లు ఖరారు చేసినట్టు ఏసీ సత్యనారాయణ అన్నారు. కాగా లడ్డూ ప్రసాదం తయారు చేయుటకు లేబర్ కాంట్రాక్టు, విద్యుత్ అలంకరణ, షామియానాలు, ఫొటోలు, వీడియో తదితర ఈవెంట్ల టెండర్లకు సరైన ధరలు రానందున వాయిదా వేశామన్నారు. ఈవో బొక్కా వీర వెంకటేశ్వరరావు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వ చేస్తున్నారా..

- జాగ్రత్తలు పాటించండి
- రంగు మారిన ధాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- క్రిమికీటకాలు దరిచేరకుండా చేయడమే లక్ష్యం



కె.నాగేశ్వరరావు

ఆలమూరు: ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకోవడంలో రైతులు ఈ సీజన్‌లో నిమగ్నమయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో గిట్టుబాటు ధర వచ్చే వరకూ భద్రపరచుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పెనుసవాల్‌గా మారింది. పండించిన ధాన్యాన్ని వెంటనే విక్రయించడం వల్ల కొంతమంది మిల్లర్లు తేమ అధికంగా ఉందంటూ ధరలో కోత విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులను పూర్తి స్థాయిలో ఆదుకునేందుకు అంతగా చర్యలు తీసుకోకపోవడంతో పాటు అక్కడక్కడా దళారుల బెడద వల్ల పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. రైతులకు ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోదాములు లేకపోవడంతో మెజారిటీ



పినపళ్లలో తేమ శాతాన్ని తగ్గించేందుకు ధాన్యం ఆరబెడుతున్న రైతులు

రైతులు తమ పంట ఉత్పత్తులను వెంటనే విక్రయించడం పరిపాటిగా మారింది. దీంతో రైతులందరూ ధాన్యం మిల్లర్లకు విక్రయించుకున్న తరువాత ధర పెరగడం ప్రతి సీజన్‌కు నిత్యకృత్యమై పోయింది. ఈ సమస్యలను అధిగమించేందుకు ధాన్యం నిల్వ చేసుకుని సరైన సమయంలో విక్రయిస్తే రైతులకు అధిక ప్రయోజనాలతో పాటు సరైన గిట్టుబాటు ధర దక్కుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి కొద్దికాలం నిల్వ చేస్తూ కనీస జాగ్రత్తలు పాటిస్తే రైతులు మంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని ఆలమూరు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ అధికారి కె.నాగేశ్వరరావు చెబుతున్నారు. అలాగే రైతులు ధాన్యం నిల్వ చేసుకునే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే నష్టం అనే ప్రశ్న ఉత్పన్నం కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో వర్షాలు అధికంగా కురవడంతో ప్రస్తుతం రైతులు ఉన్న పంటకు సంబంధించి చురుగ్గా మాసూళ్లు జరుగుతున్నాయి. ధాన్యానికి మరింత గిట్టుబాటు ధరను రాబట్టుకునేందుకు ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు అనేక మంది రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒక వేళ నిల్వ చేసుకోవడంలో ఏ మాత్రం ఏమరపాటు ప్రదర్శించినా నిర్లక్ష్యం వహించినా ధాన్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ధాన్యాన్ని నూర్చిన తరువాత ఇంటి అవసరాలు, విత్తనాల కోసం ఆరు నెలల నుంచి ఏడాది పాటు భద్రపరచుకోవలసిన అవసరం ఉంటుంది.

ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించుకోవాలి

సాధారణంగా వరి కోతల సమయంలో ధాన్యం సుమారు 20 శాతం వరకూ తేమ ఉంటుంది. అయితే ధాన్యాన్ని ఆరబెట్టడం ద్వారా తేమ శాతాన్ని ఐదు వరకూ తగ్గించుకోవచ్చు. ధాన్యంలో సుమారు 14 శాతం మించి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఎక్కువగా ఉండే కారణంగా ఆ పరిస్థితులు లేకుండా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. అలాగే క్రిమి కీటకాలు, ఎలుకల బారిన పడకుండా పంటను సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకుని ధాన్యాన్ని సంరక్షించుకోవాలి. ధాన్యం నిల్వ చేసుకునే రైతులు వ్యవసాయశాఖ సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుని నియమాలు పాటిస్తే ఈక్రింది క్రిమి కీటకాల నుంచి ధాన్యాన్ని రక్షించుకోవచ్చు.

ఎలుకల నివారణే ముఖ్యం

ధాన్యాన్ని నిల్వ చేసుకునే సమయంలో ఎలుకల నివారణమే ముఖ్యంగా భావించాలి. ధాన్యం గిడ్డంగుల చుట్టూ చెత్త, చెదారం లేకుండా తరచూ శుభ్రం చేయాలి. వివిధ రకాల బోనులు, బుట్టలు ఉపయోగించి ఆ ప్రాంతంలోకి ఎలుకలు రాకుండా జాగ్రత్తలు పాటించాలి. ధాన్యం గిడ్డంగుల తలుపుల కింది భాగంలో జింక్ రేకులను అమర్చాలి. తీగలు, మెస్ లాంటి పరికరాలు అమర్చి గిడ్డంగులకు ఏర్పడిన రంధ్రాలను మూసివేయాలి. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

ధాన్యం నిల్వకు ఈ జాగ్రత్తలు మేలు

నిల్వ చేసుకునే ధాన్యాన్ని నష్టపరిచే క్రిమికీటకాల పట్ల రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి, సాధారణంగా నిల్వ చేసుకునే ధాన్యానికి ముక్కుపురుగు, నుసి పురుగు, వడ్ల చిలుక తదితర కీటకాలు ఎక్కువగా ఆశించి పట్టి పీడిస్తుంటాయి.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకునేందుకు సిమెంట్, వెదురు, లోహపు గాదెలను వినియోగించుకోవచ్చు. ఎక్కువ ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు, గిడ్డంగులు, సిమెంట్ కాంక్రీట్ గదులను ఉపయోగించుకుంటేనే పూర్తి రక్షణ ఉంటుంది.

ముఖ్యంగా క్రిమి కీటకాలు, తేమ, వర్షపునీరు లోనికి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ఎలుకలు ప్రవేశించే కన్నాలు ఉంటే గాజు పెంకులు ఉంచి సిమెంట్‌తో మూసివేయాలి. ధాన్యాన్ని నిల్వచేసుకునే సమయంలో కొత్త గోనె సంచులను వినియోగించాలి. తొలుత గోనె సంచుల లోపల, బయట మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. మరుసటి రోజు ఆ గోనె సంచులను ఎండలో పెట్టిన అనంతరం ధాన్యాన్ని నింపాలి.

గ్రామశాఖలు పటిష్టంగా ఉండాలి

మాజీ మంత్రి గొల్లపల్లి



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులతో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: వైఎస్సార్ సీపీ గ్రామ శాఖలు పటిష్టంగా ఉండాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మలికిపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండలంలోని 21 గ్రామశాఖల అధ్యక్షులతో శుక్రవారం సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలు పటిష్టంగా ఉండాలని అప్పుడే పార్టీ బలంగా ఉంటుందని తద్వారా అధికార పార్టీ చేసే దురాగతాలను అరికట్టవచ్చని ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయవచ్చని అన్నారు. ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ అధికారులను నిలదీసి న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని ఇంకో పక్క నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడం వల్ల సామాన్యుడి బతుకు బండి ముందుకు వెళ్లటం లేదన్నారు. సమావేశంలో రాజోలు జెడ్పీటీసీ మట్టా శైలజ, కె.యస్.ఎస్ రాజు, పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాస్, ఈద రవిరెడ్డి, యెనుముల నారాయణస్వామి, ఉచ్చుల వెంకటరావు, కూనపరెడ్డి రాంబాబు, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన



పెదపట్నంలంకలో లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మామిడికుదురు: పవిత్ర కార్తికమాసం సందర్భంగా పెదపట్నంలంకలో కొలువుదీరిన ఉమా సత్యలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆదిరాజు రఘునాథశర్మ ఆధ్వర్యంలో ముందుగా విఘ్నాధిపతి వినాయకునికి అభిషేకం, సత్యలింగేశ్వరునికి పంచామృతాభిషేకం, అనంతరం ఉమాదేవికి ఘనంగా లక్ష కుంకుమార్చన పూజను జరిపించారు. వేద మంత్రాల నడుమ ఈ పూజ ఆద్యంతం కనులపండువలా జరిపించారు. అధిక సంఖ్యలో మహిళలు ఈ పూజలో పాల్గొన్నారు. అప్పనపల్లి అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా స్వామికి పలు ప్రత్యేక పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్త దంపతులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన ముత్యాలమ్మకు శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో ఈ పూజలు అత్యంత వైభవంగా జరిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భారీ ఎత్తున్న అన్నసమారాధన జరిపారు.

సంజయ్‌మూర్తి నియామకంపై హర్షం

రాజోలు: భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(సీఏజీ)గా అమలాపురం మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి తనయుడు కొండ్రు సంజయ్‌మూర్తి నియామకంపై రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. సీఏజీగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి సంజయ్‌మూర్తి కావడం కోనసీమకే గర్వకారణమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి గొల్లమండల స్టాలిన్, న్యాయవాదులు పొన్నాడ సూర్యారావు, జాలెం భాస్కరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొత్తపేట: నూతన మద్యం పాలసీ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని స్థానిక ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని మద్యం వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం సీఐ స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మద్యం నిబంధనలను పునఃప్రస్తావించారు. మద్యం ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని, ఆ మేరకు షాపుల వద్ద దరల పట్టికలు డిస్‌ప్లే చేస్తున్నట్టు తెలిపారు. షాపులు ఉదయం 10 గంటలకు తెరచి రాత్రి 10 గంటలకు మూసేయాలన్నారు. నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన తరువాత అక్టోబర్ ఒకటి నుంచి నేటి వరకూ స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో దాడులు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా మద్యం ప్రియిస్తున్న 28 మందిని అరెస్టు చేసి, 27 కేసులు నమోదు చేశామన్నారు. నిబంధలనకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్టు, షాపుల్లో ఎంఆర్పీ కంటే ఎక్కువ రేట్లకు మద్యం ప్రియించినా తమకు సమాచారం అందిన వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పై నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్టు ఎవరు గుర్తించినా సెల్ 9409024235 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

భోగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



పి.గన్నవరంలో గరుడేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన

అంబాజీపేట: మొసలపల్లిలో వేంచేసిన మధుమానంత భోగేశ్వరస్వామికి శుక్రవారం లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.పెదపూడిలో మేనకేశ్వరస్వామి, గంగలకుర్రు అగ్రహారంలో చెన్నమల్లేశ్వరస్వామి, వక్కలంకలో కాశీవిశ్వేశ్వర స్వామి స్వామి వార్లకు, ప్రత్యేక అభిషేకాలు, లక్ష పత్రి పూజలు చేశారు. నందంపూడి, తొండవరం, వాకలగరువు, ముక్కామల, కముజువారిలంక, వ్యాఘ్రేశ్వరం, చిరతపూడి, ఇసుకపూడి గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: కార్తిక మాసం సందర్భంగా స్థానిక గరుడేశ్వరాలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. ఆలయ అర్చక స్వామి భైరవభొట్ల సత్యవెంకట నారాయణమూర్తి ఆధ్వర్యంలో, విలపర్తి ఫణిధర్ శర్మ బ్రహ్మత్వంలో స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఈఓ ప్రసాదరాజు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలో కొలువైన క్షణముక్తేశ్వరునికి శుక్రవారం లక్ష బిల్వార్చన పూజలు జరిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు. వేదపండితులు, ఆలయ అర్చకులు అయినవిల్లి సత్తిబాబు శర్మ సమక్షంలో ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు ఈ పూజలు జరిపారు. గణపతి పూజ, పంచగవ్యం, మండపారాధన, త్రిశూల పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ, శాంతి కల్యాణం వంటి విశేష పూజలు జరిపారు. సాయంత్రం దీపార్చన చేశారు. అన్నప్రసాద వితరణ చేశారు.

కళలతో సమాజంలో మార్పు



గంగలకుర్రులో కవితా పురస్కారాన్ని అంజనా గాయత్రికి అందిస్తున్న సాహితి కళాపీఠం సభ్యులు

అంబాజీపేట: సమాజంలో మార్పు కోసం కళా రంగాన్ని, కళాకారులను ప్రోత్సహించాలని రాజమహేంద్రవరం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పీ కె.నరసింహారావు అన్నారు. గంగలకుర్రులో అరిగెల బలరామమూర్తి సాహితీ కళాపీఠం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను కళాపీఠం కన్వీనర్ అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అంతరించిపోతున్న కళారంగాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కవులు, రచయితలు, కళాకారుల విశిష్టతను ప్రస్తుత తరానికి తెలిసేలా అవగాహన కల్పించడమే కాకుండా వాటి ప్రముఖ్యతను తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా కవితా పోటీలను నిర్వహించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ వచన కవితా పోటీల్లో రాజమహేంద్రవరంకు చెందిన అంజనాగాయత్రికి కవితా పురస్కారం, షేక్ ఖాదర్ వలీకి కళా పురస్కారం, ఇంటలిజెన్స్ ఎస్సై జి.రామకృష్ణకు కవితా ప్రోత్సాహక పురస్కారం, యల్లమిల్లి నాగసుధాకొండకు సేవా రంగం పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఫిలిం ఇండస్ట్రీ రచయిత, డైరెక్టర్ పడాల శివ సుబ్రహ్మణ్యం, టి.గనిరెడ్డి, దీపక్‌రాజ్, ఉదయ్‌భాస్కర్, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం: వాడ్రేవుపల్లిలో ఈనెల 20న ఇరవై ఏళ్ల యువతి ఇంటి నుంచి అదృశ్యమైన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలానికి చెందిన యువతి 16 రోజుల క్రితం వాడ్రేవుపల్లిలోని పెద్దమ్మ ఇంటికి వచ్చింది. ఈనేపథ్యంలో 20వ తేదీ రాత్రి ఆ యువతి ఇంటి నుంచి అదృశ్యమైంది. యువతి పెద్దమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

నేడు సత్యసాయిబాబా జయంతి

కొత్తపేట: సమాజ సేవా స్ఫూర్తి ప్రదాత భగవాన్ సత్యసాయిబాబా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు స్థానిక సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్) తెలిపారు. 'మానవ సేవే మాధవ సేవ' అన్న నానుడి, భగవాన్ సత్యసాయిబాబా పిలుపునకు అనుగుణంగా కేఎస్ఎన్, సుతాపల్లి లక్ష్మీనారాయణరావు తదితర సత్యసాయి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో దీనుల సేవలో తరిస్తున్నారు. నిరాదరణకు గురైన వారిని గుర్తించి వారికి సత్యసాయిబాబా ఆదేశాల స్ఫూర్తితో సుమారు 55 ఏళ్లుగా వివిధ రూపాల్లో సేవలు అందిస్తున్నారు. సుమారు 25 మందికి అన్నం క్యారేజీలు వారి ఇంటికి తీసుకువెళ్లి అందిస్తున్నారు. అలాగే వైద్య శిబిరాలు, గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ, సీమంతాలు, పేద మహిళలకు కుట్టు శిక్షణ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సత్యసాయిబాబా జయంతి సందర్భంగా మండలంలో పంచాయతీ, ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ, తదితర సేవా కార్యక్రమాలు, భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు కేఎస్ఎన్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బాబా భక్తులు, సేవా తత్పరులు పాల్గొనాలని కోరారు.

గ్రామాభ్యుదయానికి కృషి చేయాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులను సన్మార్గంలో పెట్టడం ద్వారా మహిళ సంరక్షణ కార్యదర్శులు (మహిళ పోలీసులు) కృషి చేయాలని ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం మహిళ పోలీసులతో సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఓ ఎం.మెహర్ ప్రకాష్ అధ్యక్షత వహించగా ఎంపీడీఓ రాజు పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా పరిశీలించి పౌష్టికాహారాన్ని సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలను తరచూ సందర్శిస్తూ బాలికల రక్షణకు తగిన తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీడీఓ రాజుకు మహిళ పోలీసుల బృందం పండ్లు, పూలు అందజేసి ఘనంగా సత్కరించారు.


గ్రామాల్లో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు

ఆలమూరులో శుక్రవారం మహిళా పోలీసులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై ఎం.అశోక్ నిర్వహించిన అవగాహన సదస్సులో మండలంలోని గ్రామ సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఎస్సై అశోక్ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలు, నేర సంబంధిత విషయాలను ఎప్పటికప్పుడు పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు.

తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట: పుల్లేటికుర్రు ఇందిరానగర్‌లో శుక్రవారం ఉదయం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకింటికి నిప్పంటుకుని కాలి బూడిదయింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేదునూరి ప్రసాద్‌కు చెందిన తాటాకిల్లుకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో రూ.10 వేల నగదుతో పాటు ఫర్నిచర్, వాషింగ్ మెషీన్, టీవీ, సైకిల్, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. సంఘటన స్థలానికి అమలాపురం అగ్నిమాపక అధికారి కేవీఎస్ కొండబాబు ఆధ్వర్యంలో ఎలఎఫ్ బలరామ్ తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు. సర్పంచ్ జల్లి బాలరాజు, పంచాయతీ కార్యదర్శి ఎల్.లక్ష్మీపతి, వీఆర్వో కృష్ణమూర్తి, మహిళా పోలీస్ కె.సుష్మ తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు.

వైభవంగా వారాహి అమ్మవారి పూజలు



కొత్తపేట బోడిపాలెం దుర్గాదేవి ఆలయం వద్ద వారాహి పూజలు నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: స్థానిక బోడిపాలెం వంతెన వద్ద వేంచేసిన విజయదుర్గ ఆలయం, అయ్యప్పస్వామి ఆలయాల ప్రాంగణంలో కార్తిక బహుళ సప్తమి శుక్రవారం వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి ఆలయ కమిటీ పర్యవేక్షణలో వేదపండితులు వెలువలి వెంకటశివరామ్ (శివాజీ), ఖండవల్లి పాండురంగాచార్యులు ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వేదపండితుల బృందం, స్మార్త పురోహితులు ఉదయం నుంచి రాత్రి వరకూ వివిధ పూజ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ముందుగా వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వారాహి అమ్మవారి విగ్రహం, లక్ష రుద్రాక్షలను గ్రామంలో ఊరేగించారు. మధ్యాహ్నం సామూహిక లక్ష రుద్రాక్షల పూజ, మహిళలతో సామూహిక సహస్రనామ కుంకుమార్చన తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. సాయంత్రం ధూపసేవ, నీరాజన మంత్రపుష్పాలు, వేదస్వస్తి, ప్రసాద వితరణ చేశారు. అనంతరం మండలంలోని వాడపాలెం గ్రామ పురోహితుడు, బ్రహ్మశ్రీ బాపట్ల శ్రీను చేతుల మీదుగా వేద పండితులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో కొత్తపేట పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. రెండో రోజు శనివారం జరిగే పూజల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్ట్ వద్ద శుక్రవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తికి స్వల్పగాయాలు కాగా, కారులో ప్రయాణిస్తున్న మిగిలిన ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. నర్సాపురం నుంచి రావులపాలెం మండలం రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి కారులో ఆరుగురు వ్యక్తులు వెళ్తున్నారు. వారు ప్రయాణిస్తున్న కారు అక్విడెక్ట్ చివరికి వచ్చేసరికి ముందుగా వెళుతున్న మరో కారుకు గుంతల కారణంగా షడన్ బ్రేక్ వేశారు. దీంతో ముందు కారును తప్పించే ప్రయత్నంలో వెనక కారుకు షడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి అక్కడే ఉన్న గోడని ఢీ కొట్టి రోడ్డుపై పడింది. కారు లోపల ఉన్న ఆరుగురు వ్యక్తులను స్థానికులు బయటకు తీశారు. ఈ ప్రమాదం కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది ప్రమాదం నుంచి అందరూ సురక్షితంగా బయటపడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పేట్రేగిపోతున్న ఇసుకాసురులు



తాటికాయలవారిపాలెంలో ఇసుక ట్రాక్టర్‌ను అడ్డగించి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పి.గన్నవరం: కూటమి ప్రభుత్వ పాలనలో ఇసుకాసురులు పేట్రేగిపోతున్నారు. కూటమి నాయకుల కనుసన్నల్లో అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలించుకుపోతున్నారు. ఉచిత ఇసుక మాటున దొరికినంత దోచుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో మండలంలో అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎల్.గన్నవరం శివారు పొలిమేర నడిగాడి వద్ద వశిష్ట నదీపాయలో కొన్ని రోజులుగా పడవలపై అక్రమంగా ఇసుక తీస్తున్నారు. ఐదు పడవలపై ఇసుకను తీసి ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. అలాగే స్థానిక తాటికాయల వారిపాలెం లంక భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు రెండు రోజులుగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఈనేపథ్యంలో తాము శ్మశాన వాటికగా వినియోగిస్తున్న లంక భూముల్లో చేపట్టిన అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ చింతపల్లివారిపేట, కత్తులవారిపేట, కొక్కిరివారిపేట, రజకపేటకు చెందిన ప్రజలు శనివారం ఆందోళన నిర్వహించారు. ఇసుక లోడుతో వస్తున్న ఒక ట్రాక్టర్‌ను వంతెనపై అడ్డగించి ఆందోళన చేపట్టారు. జి.పెదపూడి గ్రామ పరిధిలోని బూరుగులంక రేవులో ప్రభుత్వ అవసరాల కోసమని ఇసుక తవ్వేందుకు ట్రాక్టర్లు రావడంతో స్థానికులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. దీంతో ట్రాక్టర్లు వెనుదిరిగాయి.

వర్గీకరణ పేరుతో విడగొట్టేందుకు కుట్రలు

అయినవిల్లి: ఎస్సీ వర్గీకరణ పేరుతో ఒక్కటిగా ఉన్న దళితులను విడగొట్టేందుకు రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని రాక్స్ జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ ఆరోపించారు. రాక్స్ జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు, గుర్రాల రాంబాబుల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట జన సమీకరణలో భాగంగా కొండుకుదురులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆర్ఎస్ రత్నాకర్ మాట్లా డుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులను విడగొట్టి పరిపాలించాలని కుట్ర పన్నుతున్నాయని, ఆ కుట్రల ను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాగం సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.